## 'సిలికానాంధ్ర' ఉగాది వేడుకలు

లివర్మూర్: సిలికానాంధ్ర సంస్థ ఇటీవల సిలికానాంధ్ర సంస్థ, శివవిష్ణు దేవాలయం(లివర్మూర్) సంయ ుక్తంగా 'శ్రీ సర్వజిత్ నామ ఉగాది ఉత్సవం- గజల్ గాంధర్వం' కార్యక్రమాలను అతి వేడుకగా నిర్వహించింది. నిర్వాహకులు ప్రవేశద్వారంవద్ద ఆహూతులకు షడ్రసాల ఉగాది పచ్చడిని అందించి సాద రంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ వయసుల పిల్లలకు చిట్టిపొట్టి పాటలు, మాసాలు, ఋతువులు, సంవత్సరాల పేర్లలోను పోటీలను వసంత మంగళంపల్లి, రాజశేఖర్ మంగళంపల్లి ఆధ్వర్యంలో జరిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 170మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు.

సిలికాన్ వేలీలోని తెలుగుపిల్లలకు తెలుగులో అక్షరాస్యతను పెంపొందించాలన్న ఆశయంతో 'మనబడి' పేరిట నిర్వహించ తలపెట్టిన వారాంతపు పాఠశాలకు శ్రీకారం చుడుతూ పిల్లలకు అక్షరాభ్యాసాలు ఉగాది సందర్భంగా నిర్వహించారు. 'మనబడి' పాఠ్యప్రణాళిక కూచిభొట్ల ఆనంద్ బృందం రూపొందిస్తోంది. ఇప్పటివరకూ సుమారు 150మంది పిల్లలు విద్యార్థులుగా పేర్లు నమోదు చేయిచుకున్నారని, పాఠ్యప్రణాళిక కూడా అత్యున్నతప్రమాణాల మేర తయారయిందని మనబడి నిర్వాహకులు కిషన్‌రావు, తిరుమల శ్రీనివాసరావు, వల్లి, శంకర్ తూములూరు, రాజు తెలిపారు. మనబడికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలుగు విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఆవుల మంజులత తన సందేశంలో తెలిపారు.

అనంతరం ఘనాపాఠి మారేపల్లి వెంకటశాస్త్రి వేదపఠనంతో ఉగాది ఉత్సవం ప్రారంభమయింది. పలువురు బాలలు షీలా సర్వా నిర్వహణలో స్వాగతగీతాలు ఆలపించారు. ఆ తర్వాత కవిసమ్మేళనం నిమిత్తం కవులను కార్యదర్శి తల్లాప్రగడ రావు వేదికపైకి ఆహ్వానించగా, సిలికానాంధ్ర అధ్యక్షుడు విస్సంరాజు శ్రీఫణి ఆహూతులను స్వాగతించారు. కార్యక్రమానికి అధ్యక్షునిగా హూస్టన్‌నుంచి వచ్చిన హాస్యరచయిత, వంగూరి ఫౌండేషన్ నిర్వాహకుడు వంగూరి చిట్టెన్‌రాజు వ్యవహరించి, హాస్యపూరితమైన స్వీయకవితతో అందరినీ అలరించారు. మారేపల్లి శాస్త్రి పంచాంగ పఠనం చేసి, హాస్యస్ఫోరకంగా భవిష్యత్తును వివరించారు. వివిధ అంశాలపై యేడెం మస్తాన్‌రెడ్డి, ముంతాజ్‌బేగం, కూచిభొట్ల శాంతి, ప్రఖ్య మధు, తల్లాప్రగడ రావు, గుండా శివచరణ్, దారా సురేంద్ర పదునైన కవితలను వినిపించారు. ప్రేక్షకుల్లోని కవితాస్ఫూర్తిని వెలికి తీసేందుకు 'చిత్రకవిత్వం' అనే అంశాన్ని కూడా నిర్వహించారు. అందులో భాగంగా మూడు చిత్రాలను చూపి ప్రేక్షకులను కవితలు రాయాల్సిందిగా కోరారు. దీనికి మంచి స్పందన లభించింది. కవిసమ్మేళనం తర్వాత చిట్టెన్‌రాజును 'సిలికానాంధ్ర సాహిత్య భారతి' బిరుదుతో కార్యవర్గం సత్సరించింది.

ఆ తర్వాత 'గజల్ గాంధర్వం' కార్యక్రమం శ్రోతలను ఉర్రూతలూగించింది. ప్రఖ్యాత తెలుగు గజల్ కవులు సి.నారాయణరెడ్డి, రెంటాల రాసిన అయిదు గజళ్లు, సిలికానాంధ్ర కార్యదర్శి తల్లాప్రగడ రావు రాసిన నాలుగు గజళ్లను పొట్టి యామిని, తల్లాప్రగడ రావు, నారాయణరాజు స్వరపరిచి ఆలపించారు. వారితో పాటు ఈ గజళ్లను వంశీకృష్ణ నాదెళ్ల, చంద్రశేఖర్, శ్యామల దశిక, పద్మజ కూడా పాడారు. నెల్లూరు హైమానంద్, భమిడిపాటి శ్రీనివాస్ వాద్యసహకారం అందించగా, కూచిభొట్ల ఆనందం వ్యాఖ్యాతగా వ్యవహరించారు.